క్లుప్తంగా

రిజర్వేషన్ పెంచాలి

భూపాలపల్లి రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ క్యాతం మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ప్రకటన చేసిందన్నారు. కులగన చేసినప్పటికీ రిజర్వేషన్స్ ప్రకటించకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నదని ఈ విషయంలో బీసీలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక



టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లిలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీని మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల శక్తికేంద్ర ఇన్‌చార్జ్ నాంసాని రమేశ్ కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా బొడ్డు రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆనందపు ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా రాసమల్ల సాంబమూర్తిని నియమించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్‌గా దుగ్యాల రాంచందర్‌రావు, మండల నాయకులు పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్



కాటారం: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా కాటారం మండల కేంద్రానికి చెందిన కలికోట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తమిళనాడు రాష్ట్రం మధురైలో ఆదివారం నిర్వహించిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ నూతన అధ్యక్షుడు రామకృష్ణ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. తన నియామకానికి సహకరించిన క్లబ్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. నూతన పదవితో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. శ్రీనివాస్ నియామకంపై వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ప్రత్యేక పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం ఆల య అర్చకులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రోజు సరితమల్లేశ్వర్, నందిని, హర్షిని, సైరెడ్డి కృష్ణ, సావంత్, శిల్ప, సరోజన, ఈగ మౌనికప్రదీప్, అయాన్‌శ్రీనవ్‌లు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి 18 మెట్లపై జ్యోతులు వెలిగించి అన్నదానం చేపట్టారు. అనంతరం అయ్యప్పస్వామి జీవిత చరిత్రపై జరిగిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్‌గుప్తా, చంద్రశేఖరం, ఈశ్వరయ్య, శంకరయ్య, వేణు, రాజు, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, గురుస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌యాక్ట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి



శాయంపేట : గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని జీపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచాలని, కేటగిరీల ప్రకారం గుర్తించాలన్నారు. ఈ మేరకు ఈనెల 17వ తేదీన నిర్వహించతలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీపీ ఉద్యోగులు మల్లేశం, రమేశ్, యాకయ్య, చేరాలు, రవి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



రామ కృష్ణయ్య (ఫైల్)

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామానికి చెందిన గొంది రామకృష్ణయ్య(105) ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణయ్య అతని పనులు అతను చేసుకునే వాడని తెలిపారు. ఆయన మృతి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చీకుపల్లి గ్రామంలో బ్రిటీష్ పాలకుల కాలంలో నిర్మించిన భవనాల కన్నా ముందు పుట్టారని గ్రామస్తులు తెలిపారు.

ఆడ, మగ వరి సాగుపై ఆసక్తి



ఆడ, మగ వరి నారుమడి



ఆడ, మగ వరి పంట(ఫైల్)

- ఆధునిక పద్ధతులతో సాగు

టేకుమట్ల: పంటల దిగుబడిలో, నూతన వ్యవసాయ పద్ధతుల వినియోగంలో రైతులు ముందుంటున్నారు. నూతన వంగడాలను వినియోగిస్తూ పంటలను వేసి అధిక లాభాలను అర్జిస్తున్నారు. అందులో గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణాల వరకు రైతులు ఎక్కువగా ఆడ, మగ వరి సాగుపై మక్కువ చూపుతున్నారు. సాధారణ వరి సాగుకంటే ఆడ, మగ వరి సాగులో ఆధునిక పద్ధతులు అనుసరిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఆడ, మగ వరి సాగులో నూతన వంగడాలను పలు కంపెనీలు రైతులకు అందిస్తున్నాయి.

ఆధునిక పద్ధతిలో పంట సాగు..

నూతన వ్యవసాయ విధానంలో నారు మడి నుంచి వరి నాటు వరకు ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తుంటారు. నారు పోసినప్పుడు వారం రోజుల తేడాతో ముందుగా మగ నారు, తర్వాత ఆడ నారును పోస్తారు. ముందుగా మగ నారును నాటి తర్వాత వారం వ్యవధిలో ఆడ నారును నాటు వేస్తారు. పొలంలో ఆడ, మగ మొక్కలకు మధ్యగా 30 ఇంచుల ఖాళీ స్థలాన్ని ఏర్పాటు చేసి నాటు వేస్తారు.

క్రలతో, తాళ్లతో ఫలధీకరణం..

నాటిన నుంచి 90 రోజుల్లో పంట పూత దశకు చేరుకోగానే ఫలధీకరణం చేస్తారు. వరి మడిలో ఉన్న మగ వరి పూతను ఆడ వరిపై పడేలా కర్రలతో, తాళ్ల సహాయంతో దులుపుతారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 15 రోజుల పాటు ఫలధీకరణం చెందిస్తారు. ఆడ, మగ వీరి సాగులో సాధారణ వరి సాగుకంటే పెట్టుబడి కాస్త ఎక్కువే ఉంటుంది. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది.

రైతులకు లాభాలు

సాధారణ వరి సాగులో ఎకరానికి 28 నుంచి 30 క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని పండిస్తారు. సాధారణ వరి ధాన్యానికి క్వింటాకు ధర రూ.2300 నుంచి రూ.2500 వరకు ఉంటుంది. అదే ఆడ, మగ వరి సాగులో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ధర రూ.8000 నుంచి రూ.13000 వరకు ఉండడంతో ఒక ఎకరా సాగులో సుమారు రూ.లక్షకు పైగా లాభాలు రావడంతో ఎక్కువ మంది రైతులు ఆడమగ వరి పంట సాగుపై ఆసక్తి చూపెడుతున్నారు.

ప్రతీ సంవత్సరం సాగు చేస్తున్నా..



నాకున్న నాలుగు ఎకరాల భూమిలో రెండెకరాల్లో ఆడ, మగ వరి పంటను సాగు చేస్తున్నాను. పంట సాగులో కాస్త కష్టం ఎక్కువైనా ఫలితం మాత్రం ఉంటంది. అందుకే ప్రతీ సంవత్సరం ఆడ, మగ పంటను సాగు చేస్తున్నాను. ఆడ వరి వడ్లకు ఎకరానికి రూ.లక్ష వరకు లాభం వస్తుంది. మగ వడ్లకు కూడా డబ్బులు రావడంతో ఎక్కువగా పంటలు వేస్తున్నాం.

- రవీందర్, రైతు కుందనపల్లి

కంపెనీ వారే కొనుగోలు..

రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువెళ్లకుండా విత్తనాలను ఇచ్చిన కంపెనీ వారే ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో రైతులకు అమ్మే సమస్య ఉండకుండా సులభతరంగా ఉంటుంది. ధాన్యాన్ని అమ్మగా వచ్చే నగదు నేరుగా రైతుల ఖాతాల్లోకే నిర్ణీత సమయంలో చేరడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఆర్భాటానికే శంకుస్థాపనలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటాల కోసమే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రులు ఇద్దరు నియోజకవర్గానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు రావడం సంతోషమన్నారు. కానీ వైద్యశాఖ మంత్రి భూపాలపల్లికి వచ్చి కనీసం వైద్యశాఖపై రివ్యూ చేయలేదన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల మీద ఉన్న శ్రద్ధ పనుల నిర్వహణ మీద లేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. భూపాలపల్లి ప్రాంతంలో భవిష్యత్ తరాలకు ఎటువంటి అసౌకర్యం కలగకుడదనీ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే సంకల్పంతో మెడికల్ కళాశాల ప్రారంభించినట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి ఒక్క ప్రాంతానికి వచ్చే ముందు శాఖ పరమైన రివ్యూ చేసి లోపాలను గుర్తించి వాటిని మంజూరు చేయాలి కానీ వట్టి చేతులతో వచ్చి గట్టి మాటలు మాట్లాడి పోయారని విమర్శించారు. జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లు లేరని, సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్ లేదన్నారు. అలాగే వెంటిలేటర్స్ లేవని ఇలాంటి వాటి మీద రివ్యూ చేసుకొని వచ్చి అందులో కనీసం వాటిని మంజూరు చేయాల్సింది పోయి ఆయారామ్ గాయారామ్ అన్నట్లు మంత్రిదామోదర రాజనర్సింహా వచ్చివెళ్లారని అన్నారు. అనంతరం భాస్కర్ గడ్డలో డబుల్‌బెడ్ రూం వద్ద దీక్షలు చేస్తున్న లబ్ధిదారులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దూ, ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ముసలమ్మతోగు, మొద్యాలతోగు, చింతలపాడు, గుర్రాలబావి ప్రాంతాల్లోని గొత్తికోయలకు ఆదివారం సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ దుప్పట్లను స్వెటర్లను పంపిణీ చేశారు. పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 300 దుప్పట్లు, 200 స్వెటర్లు, 100 మఫ్లర్లను పేద ప్రజలకు అందజేశారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సంతోష్, శ్రీకాంత్, ప్రసన్న, అఖిల తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఒకచోట కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులను మెమోంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రావు, శ్రీలత, జయశ్రీ, రమేశ్, రాజుకుమార్, భద్రయ్య, పూర్వ విద్యార్థులు చట్ల నరేష్, బత్తిని రాజు, సురేందర్, రత్నాకర్, కిరణ్, లలిత, సుమలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ కేటాయించడంపై హర్షం

మొగుళ్లపల్లి: మండలానికి 108 అంబులెన్స్ కేటాయించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను మరింతగా మేరుగు పరిచేందుకు అంబులెన్సులు సేవలను పలు ప్రాంతాలకు కేటాయించింది. ఈ కేటాయింపులో భాగంగా మొగుళ్లపల్లి మండలానికి స్థానం కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు తక్కళ్లపెల్లి రాజు, రఫీ, ఎర్రబెల్లి పున్నంచందరావు, నడిగొటి రాము, నీల రాజు, మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ మృతికి సానుభూతి లేదా?

మొగుళ్లపల్లి: నటుడిని అరెస్టు చేస్తే పెడబొబ్బలు పెట్టిన నేతలు, నటులు మహిళా మృతికి సానుభూతి ఎందుకు తెలియజేయలేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో పేదవారికి ఒక చట్టం ఉన్నోడికి ఇంకోక చట్టం ఉంటుందా అని అన్నారు. మృతి చెందిన మహిళా ఫ్యామిలీపై మానవత్వంతో వ్యవహరించని కొందరు నాయకులు సినిమా వాళ్ల సానుభూతి కోసం తెగ బాధపడుతుండడం హాస్యాస్పదమని మండిపడ్డారు. మోహన్‌బాబు తాను సీనియర్ సిటిజన్‌నని చెప్పుకుంటూనే జర్నలిస్టును గాయపరచడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమురయ్య



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకుమట్ల: రాష్ట్రంలో వెంటనే ఎస్సీవర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమురయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మండల నాయకులు దబ్బెట రవి, సలిగంటి శ్రీను ఆధ్వర్యంలో మాదిగల మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ పూర్తి స్థాయిలో వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ నెల 21న హైదరాబాద్‌లో మాదిగల మహాగర్జన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఎస్సీవర్గీకరణ నినాదాన్ని మరోసారి ప్రభుత్వానికి వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మురళి, సాంబయ్య, ఊదాలు, రాజయ్య, సారయ్య, భద్రయ్య, పోషయ్య, దుర్గయ్య, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా?

- గుంతలమయంగా ఏటూరునాగారం–బూర్గంపాడు రోడ్డు
- నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న గుంత

మంగపేట: మండలంలోని చుంచుపల్లి, పాలాయిగూడెం గ్రామాల మధ్య ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై కల్వర్టుల వద్ద రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. సంవత్సర కాలంగా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు మండి పడుతున్నారు. ఒకే దగ్గర కొద్ది దూరంలోనే రెండు చోట్ల గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఆదివారం చెరుపల్లి(కొత్తపేట)గ్రామానికి చెందిన పూనెం రాజు ద్విచక్ర వాహనంపై వెళ్తూ గుంతలు గమనించక పోవడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. బైక్‌పై కూర్చున్న అతడి భార్య తలకు స్వల్పగాయాలయ్యాలు. వారికంటే ముందు రెండు బైకులు అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయపడ్డారు. నిత్యం ఇదే విధంగా చాలా మంది గాయాలపాలవుతున్నారు. గుంతలు ఏర్పడి సంవత్సరం కావస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టనట్లుగా చూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. చిన్న సంఘటనలు కాకుండా ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

లక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

- కావిరి చిన్నికృష్ణ



ధర్నా చేస్తున్న కావిరి చిన్నికృష్ణ, నాయకులు

కన్నాయిగూడెం: ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలను కోల్పోయిన చిలుముల లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావిరి చిన్నికృష్ణ అన్నారు. ఈ మేరకు కుల సంఘ నాయకులతో కలిసి ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి చెందిన చిలుముల లక్ష్మి శనివారం బుట్టాయిగూడెం వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో జారి టైర్ కిందపడి మృతి చెందిందన్నారు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకోకుంటే రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య, లీగల్ అడ్వైజర్ రత్నం సుదర్శన్ నేత, నాయకులు రాంబాబు, సారయ్య, దుర్గం వెంకటయ్య, ఐలయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కరకట్టపై అక్రమ నిర్మాణాలు

- శాశ్వత నిర్మాణాలు చేపడుతున్న వైనం
- పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ అధికారులు



కరకట్టపై నిర్మించిన ప్రహరీ



కరకట్టపై నిర్మించిన కాంక్రీట్ పిల్లర్లు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జంపన్న వాగు వెంట ఉన్న కరకట్ట అక్రమణకు గురవుతుంది. గోదావరి, జంపన్నవాగు వరద గ్రామంలోకి రాకుండా 1996లో నిర్మించిన కరకట్టను పలువురు తవ్వకాలు జరిపి గోడ, పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. రైస్‌మిల్లుల యజమానులు వారి మిల్లు నుంచి వచ్చే ఊకపొట్టును నిల్వ చేసేందుకు కరకట్టను సైతం ఆక్రమించారు. కరకట్ట పటిష్టతను నీరుగార్చుతున్నారు. ఇంతా జరుగుతున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం పట్టణాలకు పరిమితం అవుతూ కరకట్ట పటిష్ఠ, మెయింటనెన్స్, పర్యవేక్షణ గాలికి వదిలేస్తున్నారు. దీంతో ప్రజలకు ఉపయోగపడాల్సిన కరకట్ట కొట్టుకపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరకట్టకు ఇరువైపులా మట్టిని కూడా తవ్వకాలు జరుపుతున్నారు. అయినప్పటికీ అధికారులకు చలనం లేకపోవడం బాధాకరం. అంతేకాకుండా కొంతమంది కరకట్ట ఉన్న మట్టిని తీసుకెళ్లి చెట్లకు, ఇళ్ల వాకిళ్లకు వాడుకోవడం వల్ల రోజు రోజుకు తరిగిపోతుంది. ఇప్పటికైనా కరకట్ట ఆక్రమణకు గురికాకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై ఈఈ జగదీశ్‌ను వివరణ కోరగా కరకట్టపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీడీ కార్మికులకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మక్రాం

శాయంపేట : బీడీ పరిశ్రమను కుటీర పరిశ్రమగా పరిగణించి బీడీ కార్మికులకు ఉపాధి కల్పించాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎండీ.మక్రాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో బీడీ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఏఐటీయూసీ మండల నాయకుడు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. బీడీ కార్మికులకు కనీస వేతన జీఓ అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. బీడీ కార్మికులకు నెలకు పది రోజుల పని కల్పిస్తున్నారని, ఇప్పటికైనా నెలకు 26రోజుల పని కల్పించి బీడీలకు సరిపడా తునికాకు, తంబాకు, దారం సరిపడా ముడి సరకులు కంపెనీలే సరఫరాల చేయాలని కోరారు. ఈపీఎఫ్ సంస్థల్లో పీఎఫ్‌కు రాజీనామా చేసిన బీడీ కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మిక సంక్షేమం కోసం నిధుల కేటాయించి వారి పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజుగౌడ్, రాష్ట్ర నాయకులు భిక్షపతి, కాసిం, మండల నాయకులు అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని దేవనగర్‌కు చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ , పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి ఆదివారం పరామర్శించారు. రాములు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు మావురపు తిరుపతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నల్లెల్ల భరత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, శ్యామ్‌రావు, వెంకన్న, తదితరులు ఉన్నారు.